ఆరోగ్య పరిరక్షణకే వైద్య పరీక్షలు

- నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మేయర్ అముదతో కలసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శనివారం నుంచి ఒక నెలపాటు ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగ్యూ ఇతర పరీక్షలు వైద్యసిబ్బంది నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లందరూ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా బర్త్, డెత్, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలు అందజేశారని గుర్తు చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇళ్ల వద్ద వైద్యులు పరీక్షిస్తున్నట్లు చెప్పారు. వీటితోపాటు శస్త్రచికిత్సలు చేసుకున్న రోగులకు విశ్రాంతి సమయంలో భృతి కింద ఆసరా పథకం ద్వారా నిధులు ఇస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు సమయం కేటాయించి పరీక్షలు చేసుకోవాలని మేయర్ అముద తెలిపారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయడం వంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక క్యాంపులు

పూతలపట్టు: మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ సచివాలయ పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి ప్రియాంక ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోనే మొదటి క్యాంపు చిటిపిరాళ్లలో ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

తవణంపల్లె: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక క్యాంపులు ఈ నెల 30వ తేదీ శనివారం నుంచి నిర్వహించనున్నట్లు తవణంపల్లె ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. 30వ తేదీన సరకల్లు, అక్టోబర్ 3న పట్నం సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 4వ తేదీన పుణ్యసముద్రం, 5వ తేదీన మల్లకుంట, 6న మల్లకుంట, 7న నలిశెట్టిపల్లె, 10న టి.పుత్తూరు, 11న చెర్లోపల్లె, 12న గోవిందరెడ్డిపల్లె, 13న పల్లెచెరువు, 17న దిగువమాఘం, 18న పైమాఘం, 19న అరగొండ, 21న జొన్నగురకల, 25న మత్యం, 26న ఎగువ తవణంపల్లె సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామని వివరించారు.

చింతలగుంటలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం చింతలగుంట డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నేడు చిత్తూరు నగరంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ అరుణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అర్బన్ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ముందస్తు ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ టెలిఫోన్ కాలనీ అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని తొమ్మిది వార్డుల్లో వలంటీర్లు, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో చేపట్టిన ఇంటింటి సర్వే పూర్తయ్యిందన్నారు. టోకెన్లు తీసుకున్నవాళ్లంతా వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. వైద్య శిబిరంలో ప్రధాన విభాగాలకు చెందిన 16 మంది వైద్యులు అందుబాటులో ఉంటారని, అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే తరహాలో నగరంలోని మిగిలిన అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లోనూ నిర్దేశించిన తేదీల్లో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఆరోగ్య సురక్షలో నర్సింగ్ విద్యార్థులు

చిత్తూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో అపోలో నర్సింగ్ విద్యార్థులు తాము సైతమంటూ ముందుకొచ్చారు. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లి, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటా సర్వేకు వెళ్లారు. వారి ఆరోగ్య వివరాలను సేకరించారు.


సత్యనారాయణపురంలో సర్వే చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

సప్తకనికలమ్మ సేవలో మంత్రి పెద్దిరెడ్డి


అమ్మవారి హారతి అందుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు రూరల్: నగరంలోని దొడ్డిపల్లి శ్రీసప్తకనికలమ్మను శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంత్రికి కర్పూర హారతులు పట్టారు. ఆలయ పెద్దలు ఆయన్ను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నాయకులు క్రిష్ణమూర్తి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం వివాదం పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటి స్థలం వివాదం పరిష్కరించండి అంటూ పెనుమూరు మండలం కలవకుంట పంచాయతీ విజయనగర్ ఎస్టీ కాలనీవాసులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆ గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వివాద స్థలంలో అక్రమ నిర్మాణాల్ని ప్రశ్నించినందుకు తమపై దౌర్జన్యం చేశారన్నారు. విచారించి తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు నదియ, గౌరి, మంగమ్మ, గీత, విజయలక్ష్మి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీమాను సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

పూతలపట్టు: వైఎస్సార్ సీపీ అందించే బీమాను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సద్వినియోగం చేసుకోవాలని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలకూరు, బండపల్లి సచివాలయాల్లో శుక్రవారం గృహసారథులకు, కన్వీనర్లకు సమావేశం నిర్వహించారు. మండలంలోని 51 సచివాలయ కన్వీనర్లు, 448 మంది గృహసారథులు అర్హులని పేర్కొన్నారు. వారికి రూ.10 లక్షల వరకు బీమా సదుపాయం పార్టీ అధిష్టానం కల్పిస్తోందని వివరించారు. సమావేశానంతరం హాజరైన కన్వీనర్లు, గృహసారథుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు విభాగం అధ్యక్షులు కోదండరెడ్డి, పాలకూరు జీవరత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మణి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


ర్యాలీలో ముస్లిం సోదరులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో శుక్రవారం రాత్రి మీలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బజార్ వీధిలోని ఆసార్– ఏ– షరీఫ్ నుం,ఇ గంగనపల్లి, దర్గా జంక్షన్, ఎమ్మెస్సార్, గాంధీ విగ్రహ కూడలి, హై రోడ్డులోని శేషపీరన్ వీధి మీదుగా జామియా మసీదు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆసార్– ఏ– షరీఫ్ కమిటీ సభ్యులు అక్తర్‌బాషా, షేరు, నవాజ్, చింటూ, ముస్లిం నాయకులు అఫ్జల్ ఖాన్, ఫహీం బాషా, అర్షద్ అయున్ ఖాన్, జబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్యుడీషియల్ వర్క్‌షాప్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు, జెడ్పీ సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జ్యుడీషియల్ ఆఫీసర్స్ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌ను హైకోర్టు పరిపాలనా జడ్జి జస్టిస్ రవినాథ్‌తిలహరి అధ్యక్షతన నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి జెడ్పీ సమావేశ మందిరంలో చేసిన ఏర్పాట్లను శుక్రవారం రాత్రి జిల్లా జడ్జి భీమారావు, మేజిస్ట్రేట్ శ్రీనివాస్, జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవితో కలిసి జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లను వారికి సీఈఓ వివరించారు.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: దేశంలో హరిత విప్లవానికి పునాదివేసి వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి పోసిన మహనీయుడు ప్రముఖ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ సుభాన్ అన్నారు. స్వామినాథన్ మృతికి శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూజలు చేసి అంజలి ఘటించి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సైన్స్ ఉపాధ్యాయుడు షంషీర్‌ఖాన్ మాట్లాడుతూ, స్వామినాథన్ వ్యవసాయ రంగానికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టూరిస్టు బస్సు- ఆటో ఢీ

తవణంపల్లె: టూరిస్ట్ బస్సు– ఆటో ఢీకొనడంతో ఆటోడ్రైవర్ గాయపడిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి కథనం మేరకు, తమిళనాడు కడలూరుకు చెందిన 40 మంది టూరిస్ట్ బస్సులో తిరుమలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. మండలంలోని పట్నం సమీపంలో ఆటోను తప్పించబోయి బస్సు డివైడర్‌ను ఢీకొంది. అప్పటికీ ఆటోను తక్కువ వేగంతో ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆయన్ను 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 40 మంది యాత్రికులకు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి భోజనం ఏర్పాటు చేశారు.


సంఘటన స్థలంలో పోలీసులు

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన


సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐరాల: విద్యార్థులు మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు(బీఐఎస్, మార్క్) ఉన్నదీ, లేనిది పరిశీలించాలని శిక్షకులు (మెంటార్) యుగంధర్ సూచించారు. మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం వస్తువుల నాణ్యతపై ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మెంటార్ మాట్లాడుతూ నాణ్యతను గుర్తించడానికి భారత ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ వస్తువులనే ఉపయోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే మార్కెట్‌లో కల్తీలను నిషేధించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ యాక్టివిటీస్‌లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్స్‌తోపాటు నగదు బహుమతి అందజేశారు. పోటీలో ప్రథమ బహుమతి విద్యార్థిని రితిక రూ.వెయ్యి, ద్వితీయ బహుమతి లక్ష్మీప్రసన్న రూ.750, తృతీయ బహుమతి గీత రూ.500, ప్రోత్సాహక బహుమతిగా విద్యార్థిని శ్రేయ రూ.250 అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కే షీట్స్ పంపిణీ


ఫోల్డర్స్ పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

చిత్తూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో ఫోల్డర్స్, కే షీట్స్ పంపిణీ చేశారు. పీహెచ్‌సీల వారీగా డీఎంహెచ్‌ఓ ప్రభావతి ఆ మెటీరియల్‌ను అందజేశారు. నేటి నుంచే జరగబోయే క్యాంపును తీసుకోవాల్సిన విషయాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలందరూ ఆరోగ్య సేవలను వినియోగించుకునేలా చూడాలని వారికి ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలాల పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

నియోజకవర్గం	మండలం	అధ్యక్షుడు
చిత్తూరు	చిత్తూరు అర్బన్	తిమ్‌స్టీఫెన్(1–25 డివిజన్లు) జ్ఞానజగదీష్(26–50 డివిజన్లు)
	రూరల్	త్యాగరాజులు
	గుడిపాల	జనార్దన్
పూతలపట్టు	తవణంపల్లె	సురేష్‌బాబురెడ్డి
	ఐరాల	చంద్రశేఖర్‌రెడ్డి
	పూతలపట్టు	శ్రీకాంత్‌రెడ్డి
	బంగారుపాళ్యం	రామచంద్రారెడ్డి
	యాదమరి	ధనంజయరెడ్డి

వ్యాసరచన పోటీలు


పోటీలను పర్యవేక్షిస్తున్న మధుసూదనం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఆ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మధుసూదనం మాట్లాడుతూ తమ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆచార్య దేవోభవ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహించిన పోటీలకు మంచి స్పందన లభించిందన్నారు. పలు పాఠశాలల్లో చదువుతున్న 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందే మొదటి ముగ్గురు విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు పంపుతామని ఆయన వివరించారు.

వరసిద్ధుని సేవలో కౌశల్



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సినీ నటుడు కౌశల్ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్వాస మీద ధ్యాసే ధ్యానం


ప్రసంగిస్తున్న పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్

తవణంపల్లె: శ్వాసమీద ధ్యాస పెట్టడమే ధ్యానమని బ్రహ్మణ రత్న మారం శివప్రసాద్ తెలిపారు. మండలంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో 11 రోజుల పాటు ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్ ప్రసంగిస్తూ గౌతమ బుద్ధుడు చెప్పిన శ్వాసమీద ధ్యాస గురించి వివరించారు. అనంతరం ధ్యానులకు బోధించిన మాస్టర్ శివప్రసాద్‌ను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలకృష్ణ, కన్వీనర్ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వ్రతం

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో శుక్రవారం పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామి ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణస్వామి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి, వ్రతమాచరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

మృతదేహంతో రోడ్డుపై నిరసన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో బిడ్డతో కలిసి తల్లి ఆత్మహత్యకు యత్నించిన ఘటనలో శుక్రవారం బాధితులు నిరసనకు దిగారు. సత్యనారాయణపురానికి చెందిన సుమతి తన అత్త, ఆడపడుచు వేధింపులు తాళలేక తన బిడ్డ యశ్వంత్‌తో కలిసి గురువారం మిద్దెపై నుంచి దూకడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ సుమతి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కోలుకుంటోంది. యశ్వంత్ మృతదేహంతో కుటుంబ సభ్యులు గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. కొద్దిసేపు తరువాత వర్షం పడడంతో అందరూ వెళ్లిపోయారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఉదయం అర్చకులు మూలవిరాట్ వీరాంజనేయ స్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు చందనాలంకరణలో కొలువైన వీరాంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్ధగిరి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో ఉభయదారులతో స్వామికి సుదర్శన హోమం నిర్వహించారు. అర్చకులు కలశ పూజ చేసి దీపారాధన చేయించారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చరణ పఠనం చేస్తూ హోమం చేశారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఉభయదారులు భక్తితో పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి 8 గంటలకు ఉత్సవమూర్తి వీరాంజనేయస్వామికి అర్చకులు అభిషేకం, పూజలు చేశారు. సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో కొలువైన స్వామి ప్రకారం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ భక్తులను కనువిందు చేశారు. భక్తుల కాలక్షేపం కోసం క్షేత్రంలో చెక్క భజనలు, కోలాటలు, హరికథలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


అర్ధగిరి క్షేత్రంలో భక్తిప్రపత్తులతో అర్చకులు నిర్వహిస్తున్న సుదర్శన హోమం

ఉత్సాహంతో మేరీ మట్టి మేరా దేశ్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు. విద్యుత్ నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సమగ్ర శిక్ష శాఖ ప్లానింగ్ కో–ఆర్డినేటర్ జయప్రకాశ్ మాట్లాడుతూ దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరుల స్మారకార్థం మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరింపేట మునిసిపల్ హైస్కూల్ హెచ్‌ఎం రమేష్‌బాబు మాట్లాడుతూ దేశంలోని మట్టి, గంగాజలం పవిత్రత ఎంతో గొప్పదన్నారు. దేశం కోసం పోరాడిన అమరువీరుల సేవలు మరిచిపోలేనివని చెప్పారు. బీఎస్ కణ్ణన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరింపేట మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల్లో ప్రధానోపాధ్యాయులు తులసీబాబు, హసన్‌బాషా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

గరుడుడిపై వరదరాజులస్వామి విహారం


స్వామివారి ధ్వజస్తంభానికి సుగంధ పుష్పాలంకరణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ వరదరాజుల స్వామి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయంలో అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజుల స్వామికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణ స్వామి అలంకరణలో అలంకరించి ఆలయ అలంకార మండపంలో కొలువుదీర్చి సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై పుర వీధుల్లో విహరించారు. భక్తులు స్వామి వారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు కళాకారులు, భరతనాట్యం, కూచిపూడి, భక్తి గీతాలు, పౌరాణిక నాటికలు ప్రదర్శించారు. రావణ బ్రహ్మ వాహన ఉభయదారులు స్వామివారి ధ్వజస్తంభానికి సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న వరదరాజులస్వామి